# మేడమీది జాబిలి

(1988)

లేచి కళ్ళను నులుముకుని కిటికీలోంచి బయటకు చూశాడు బుజ్జిబాబు. పల్చని వెలుగు లోకం మీదికి పరుచుకుంటోంది. కిటికీకి కాస్త దగ్గర జరిగి, చూపును కాస్త మీదికి సారించి ఆకాశం వంక చూడబోయేడు.

అంతే! అతని చూపు మరి ముందుకు పోలేదు - ఆశ్చర్యంతో అలానే ఉండిపోయాడు బుజ్జిబాబు.

'ఎంత అందంగా వుంది?' అనుకున్నాడు ఆశ్చర్యంనించి తేరుకున్న మరుక్షణంలో.

* * *

చదువై పోగానే ఉద్యోగం దొరకడం ఎంత కష్టమో, మధ్యతరగతి సంసారులుండే కాలనీలో ఓ బ్రహ్మచారికి అద్దెకి రూం దొరకడం అంతే కష్టం.

ఐతే, బుజ్జిబాబుకి రెండురకాల కష్టాలూ తెలియవ్.

పల్లెటూళ్ళో వుంటూ, పచ్చని పొలాల మధ్య తిరుగుతూ, స్వచ్ఛమైన గాలి పీలుస్తూ అంతకంటే స్వచ్ఛమైన మనసుతో హాయిగా పెరుగుతూ, అక్కడే పదోతరగతి, ఆ పక్కవూళ్ళోనే యింటరూ ఫస్టున పాసైన బుజ్జిబాబుకి అనుకోకుండా (ఎప్పుడో ఆకతాయిగా 'ఇది వచ్చినపుడు చూద్దాంలే' అని పేపర్లోని ప్రకటన చూసి,ఎప్లయ్ చేసిన, ఉద్యోగం అమాంతంగా వచ్చేసింది.

ఉద్యోగం రావడం అంత సులభంకాదు. కానీ బుజ్జిబాబుకి రావడానికి మాత్రం కారణం అతనికొచ్చిన మార్కులూ, కలిసొచ్చిన అదృష్టమే—

బుజ్జిబాబు బుద్ధిగా చదివేవాడు - ఫస్టు నుండాలనే పట్టుదలతో

పరీక్షలు రాసేవాడు - ప్రయివేటు కంపెనీ వారికి మనిషి తెలివితేటలే ముఖ్యంకాబట్టి; బుజ్జిబాబు తెలివయినవాడు కాబట్టి ఆ ఉద్యోగానికతన్ని ఎన్నిక చేసారు——

అయితే బుజ్జిబాబు తండ్రికి చిన్నచిన్న వుద్యోగాల మీద సదభిప్రాయం లేదు సరికదా దురభిప్రాయం కూడ వుంది. — తనకొడుకు ఏ కలక్టరో లేక అంత పెద్ద ఆఫీసరో కావాలి. లేదూ హాయిగా వున్న వూళ్ళో వ్యవసాయం చేసుకోవాలి. అంతేగాని పట్నంలో చిన్న ఉద్యోగం చెయ్యడం అతనికిష్టం లేదు.

ఏమైతేనేం, ఆ సమస్యను తెలివిగానే పరిష్కరించేడు బుజ్జిబాబు. జీవితంలో పైపైకి పోవాలంటే క్రిందిమెట్లు కూడా ఎక్కాలి అన్నాడు - తండ్రికేవేవో ఆశలు చూపించేడు. ఆ ఉద్యోగాన్ని నమ్ముకొని వూరుకాని వూరు వచ్చేశాడు వంటరిగా.

బుజ్జిబాబు ఆగదిలో దిగి అప్పుడే మూడు రోజులై పోయింది. ఉదయం ఎనిమిది గంటలకు ఆఫీసుకు బయల్దేరితే సాయంకాలం ఆరు గంటలకే రావడం-వచ్చింది మొదలు గదిలోనే.

"బుజ్జిబాబు గారూ మరి మీ భోజనమెలాగ?" మొదటి రోజే అడిగింది. ఆఫీసులోని టైపిస్టు పంకజం.

"వండుకోడమే" అన్నాడు బుజ్జిబాబు అమాయకంగా - బుజ్జిబాబు ఎంత తెలివయినవాడో అంత అమాయకుడు.

"మైగాడ్! మీరే!" అని ఆశ్చర్యపోయి, "అయితే వంటొచ్చిన మగాడన్నమాట" అంది.

ఆమాటలోని ఓవింత ధ్వని 'అలా చెప్పకుండా వుండాల్సింది' అని అనుకునేలా చేసిందతనిని.

బుజ్జిబాబుకి వంట చెయ్యడం సుబ్బరంగా వచ్చును. వాళ్ళమ్మ యింట్లోకి రాని సమయాల్లో చెల్లెళ్ళకి వంటలో సాయం చేసి వాళ్ళకి

నేర్పేవాడు. వంకాయ ముద్దకూర ఎలా చేయాలో, బంగాళదుంపల ఉల్లి కూర ఏ పాళంలో చెయ్యాలో చెప్పేవాడు. దోసకాయ బండ పచ్చడీ, పెసరపప్పు పప్పులుసూ దగ్గరుండి చేయించేవాడు.

"ఫర్వాలేదు-రేపొద్దున వాడి పెళ్ళాం సుఖపడుతుంది" అనేవాడు బుజ్జిబాబు తండ్రి అతని వంటను మెచ్చుకుంటూ — బుజ్జిబాబు తల్లిమాత్రం ఆమాటకు ఒప్పుకునేది కాదు.

"పెళ్ళాన్ని సుఖపెడతాడేమో గాని యిలామాత్రం కాదు. వాడికేం ఖర్మ? హాయిగా వంట మనిషినే పెట్టుకుంటాడు. అయినా అరవయి నాలుగు కళల్లోనూ వంటకూడా ఒక కళే. అన్ని కళలతో పాటు వాడికిదీ అబ్బింది" అనేదావిడ.

"ఎవరేమంటేనేం.... అదిప్పుడు ఉపయోగపడుతోంది హోటల్ తిండికి బలై పోకుండా" అనుకునేవాడు బుజ్జిబాబు రోజూ రాత్రులు వంట చేసుకుంటూ.

ఉదయంలేచి కాఫీపెట్టుకు తాగడం, పనిమనిషి చేత గిన్నెలు తోమించుకుని వంట చేసుకోడం; కామన్ బాత్రూం ఎప్పుడు ఖాళీ అవుతుందో చూసుకుని అప్పుడు స్నానం చెయ్యడం: భోంచేసి ఆఫీసు కెళ్ళి పోడం, అట్నించొచ్చాక తీరిగ్గా ట్రాన్సిస్టరు వింటూ కూనిరాగాలు తీస్తూ వంట చేసుకోడం, స్నానంచేసి, భోంచేసి ఏపేపరో, పుస్తకమో చదువుతూ పడుకోడం-ఇదీ యీ మూడు రోజుల దినచర్యా-

నాలుగోరోజు నిద్ర లేస్తూనే అలవోకగా అటు చూశాడు! మనసంతా మునుపెన్నడూ ఎరుగని హాయితో నిండిపోయింది! ముగ్ధుడయ్యేడు!!

అందమైన సూర్యోదయాలనెన్నిట్నో చూశాడు బుజ్జిబాబు. రోజూ చూస్తున్నా అందులో ఏదో ఒక కొత్త అందం కన్పించేదతనికి.

'ఆ ఉదయాలన్నిటినీ మరపించిన ఉదయమిది' అన్పించింది అతనికి తొలిసారిగా.

'ఎంత అందంగా వుందామె!' అనుకుని అటువంక చూశాడు.

ఆమె లేదక్కడ.

ఆహ్లాదకరమైన లేత నీలంరంగు ఆకాశం మీద తెల్లతెల్లని మబ్బుతునకలు రెండు ఒకదాని ప్రక్కనొకటి తేలిపోతూ సోలి పోతూ కన్పించాయతనికి.

'అన్నను—ప్రకృతిదే అందం.

ఆమెదే అందం..' అనుకున్నాడు సంతృప్తిగా.

0 0 0

ఆ సాయంకాలం ఆఫీసునుండి వస్తూనే ఆ మేడమీదికి ఆశగా చూశాడు బుజ్జిబాబు .. అతని ఆశ నిరాశే అయింది.

ఉదయంనించీ ఆమె రూపమే అతని మదిలో మెదుల్తోంది. ఆఫీసులో ఉన్నంత సేపూ ఎంతట సాయంత్రమౌతుందా అని ఎదురు చూశాడు.

త్వరత్వరగా తన పనుల్ని తెముల్చుకుని స్నానం చేసి, తెల్లని షరాయిపై తెల్లచొక్కా వేసుకుని వచ్చి వీధిగుమ్మంలో నిల్చున్నాడు- వీధిలో పిల్లలు ఆడుకుంటున్నారు.

నెమ్మదిగా తలెత్తి ఆ మేడ వైపు చూశాడు. అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి!

ఉదయంకంటే స్పష్టంగా కనిపిస్తోందామె—

నిండు చందమామను పోలిన గుండ్రని ముఖం. అందమైన కనురెప్పల క్రింద కాటుకదిద్దిన అర్ధనిమీలిత నేత్రాలూ; ఒత్తయిన జుట్టు; జడలో కనకాంబరాలూ; కెంపురంగు జాకెట్టుపై గంధం రంగు వోణీ—

'అందం ఆకర్షణ రంగరించుకున్నట్లుందామె రూపం' అనుకున్నాడు బుజ్జిబాబు.

ఆ సమయంలో ఆ అమ్మాయికూడా తనవంకే చూస్తున్నట్లు గమనించి ఒకింత బిడియపడ్డాడు——

'ఈ క్షణంలో ఎవరైనా తమను చూస్తే....?' అనే అనుమానమొచ్చింది. అప్పటికే రెండిళ్ళవతల అరుగుమీద కూర్చున్న మామ్మగారు బుజ్జిబాబు వంకే చూస్తోంది - అంతే! మనసులోని మధురమైన వూహాలన్నిటినీ ప్రక్కకు నెట్టి, గదిలోపలికొచ్చి తలుపు మూసి, కుర్చీని కిటికీ ప్రక్కగా లాక్కుని కూర్చున్నాడు.

చంద్రబింబం ఎటుపయిపో చూస్తోంది——

ఆ ముఖంలో ఎంత ప్రశాంతత? ఎంత శాంతం?

బుజ్జిబాబు మనసు పరిపరి విధాలపోయింది.

ఎంతమంది అమ్మాయిల్ని చూడలేదు తను! ఎప్పుడూ యిలా కాలేదు - పెద్ద చెల్లెలు విమల స్నేహితురాళ్ళు ఎంతోమంది వచ్చేవారు తమ యింటికి- వాళ్ళందరితోనూ తనెంతో క్లోజ్‌గా వుండేవాడు- వేళాకోళాలు చేసేవాడు - అయినా ఎవరి మీదికీ తన దృష్టి పోలేదు——

మరిప్పుడీ మానసిక స్థితికి కారణం?

ఆమెలోని అందమా? ఆకర్షణా లేక తన వంటరి తనమా?

ఒంటరితనం మనసుని వెర్రితలలేయిస్తుందట. కానీ అది మాత్రం నిజం కాదేమో! మరి నిజమైన దేమిటి?

ఇష్టమా....? లేక....ప్రేమా?

0 0 0

రెండు రోజులు ఊపిరాడకుండా గడిచి పోయాయి. ఇంటిలో వున్న ప్రతిక్షణమూ బుజ్జిబాబు దృష్టి మేడపైనే వుండేది! ఉదయమో.

సాయంత్రమో, రాత్రో ఆమెను చూడందే వుండలేక పోయే పరిస్థితి ఏర్పడింది. ఆమె కన్పిస్తే చాలు...అదో రకమైన తృప్తి, ఆనందం.

"ఈ లక్షణాలనుబట్టి చూస్తె తనా అమ్మాయిని ప్రేమిస్తున్నాడా" అనే అనుమాన మొచ్చింది బుజ్జిబాబుకి.

ప్రేమిస్తె ఏమౌతుంది?

ప్రేమిస్తె పెళ్ళవుతుందా?

సినిమాల్లో అవుతుందేమో! మరి....మనకథలూ- సాహిత్యం అంతా ప్రేమ విషాదాంతమే అంటున్నాయి.

మరి?....మరి?....ఆ పైన ఆలోచించలేక పోయాడు బుజ్జిబాబు.

ఆరోజు ఆదివారం.

సాయంత్రం బాగా వెలుగుండగానే టాయ్‌లెట్ అయి, తనకు నచ్చిన బట్టలు వేసుకుని క్రాఫింగు అందంగా దువ్వుకొని అరుగుమీద కొచ్చి నిల్చున్నాడు.

ఎవరుచూస్తె తనకేం? వీధిలో ఎందరో వుంటారు-ఎవరూ ఎవరి వంకా చూడకుండా ఎలాకుదుర్తుందీ? అనుకుని తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు.

ఆ మేడ వైపు ఆశగా చూశాడు-ఆమె లేదు!

మేడ అంత పెద్దదేం కాదు-ముందుకాస్త డాబా; ఆ వెనుకగదులు డాబా మీదికే మెట్లున్నాయి. గుమ్మాలకీ, కిటికీలకీ పువ్వుల కర్టెన్లున్నాయి.

ఆ మేడ ముందే సుమారు ఐదారు ఏళ్ళు వయసుగల పిల్లలు బంతాట ఆడుకుంటున్నారు-ఒక్క-క్షణం వారివంక చూశాడు బుజ్జిబాబు. వాళ్ళల్లో ఆ అమ్మాయి తమ్ముడొకడు వుండి వుండడా అన్పించి దతనికి-ఆ ఆలోచన వచ్చేక అందులోని ప్రతి ఒక్క-రివంకా పరీక్షగా చూశాడు. ఎర్రగా బొద్దుగా ముద్దుగా వున్న ఆరేళ్ళబ్బాయొకడు ఒకట్రెండుమార్లు ఆ మేడలోకే వెళ్ళిరావడం గమనించేడు బుజ్జిబాబు

అంతే! అతని బుర్రలో మెరుపులాంటి ఆలోచనొకటి మెరిసింది–ఎంత పాత ఆలోచనైనా అదే సరియైనది అన్పించింది–ఆ వెంటనే ఆవీధి చివరి కిళ్ళీకొట్టు దగ్గర కెళ్ళి ఓ నాలుగు చాక్లెట్లు కొని జేబులో వేసుకుని చక్కా వచ్చాడు.

ఆ వేళకి డాబా మీదికి రానే వచ్చింది చంద్రవదన. ఎదురింటి మామ్మగారు కూడా అరుగుమీద లేకపోవడంతో కాస్త ధైర్యం కూడా వచ్చింది బుజ్జిబాబుకి. ఏమైనా సరే తన యిష్టాన్ని ఎలాగోలా తెలియ జేయాలనుకుని ఆమె వంక అమాయకంగా చూశాడు. సరిగ్గా అదే సమయంలో ఆమె కుడా తనవంకే చూస్తూండడం బుజ్జిబాబు కెంతో ఆనందాన్ని కలిగించింది– ఆ ఆనందం అతని ముఖంలోనూ తొణికిస లాడింది.

దాంతో చూపుమరల్చుకుని పిల్లల వంక చూసిందామె,

"ఛా. ఆకాస్త నవ్వునూ చూపకుండా వుండాల్సింది' అను కున్నాడు.

"ఏంటోయ్. బుజ్జిబాబూ ఖాళీగానే వున్నట్టున్నావ్–అలా బీచి కెళ్ళొద్దామేంటి?" అడిగేడు యింటి ఓనరు జగన్నాథం. అతన్ని చూస్తె సిగరెట్ కాలుస్తూన్న అస్తిపంజరం గుర్తుకొస్తుందిబుజ్జిబాబుకి–దిగిన రెండో రోజునే ఏకవచన ప్రయోగం మొదలెట్టేడాయన–

ఒక్కక్షణం తడబడి "రాలేనండీ. ఓ ఫ్రెండు కోసం చూస్తు న్నాను." అనేశాడు అతికష్టం మీద– నిజానికి ఆవూళ్ళో ఆతనికి ఫ్రెండ్సులేరు, పైగా వచ్చిన దగ్గర్నుంచీ బీచికి వెళ్దామనే అనుకుం టున్నాడు– కానీ కుదరటం లేదు–

పుస్తకాల్లో సముద్రం గురించి వర్ణన వచ్చినపుడల్లా వెన్నెట్లో సముద్రాన్ని....అదీ నిండు పున్నమినాడు చూడాలని బుజ్జిబాబులోని కళాహృదయం వువ్విళ్ళూరేది.

'ఏమైతేనేం తనిప్పుడు వెళ్ళలేదు- అదృష్టం కల్సిరావాలేగాని చంద్రవదనతో కలిసి వెళ్తే ఏ రాత్రి పున్నమి రాత్రి కాకుండా పోతుందీ' అనుకున్నాడు.

ఆ ఆలోచన బుజ్జిబాబుకి నచ్చింది. ప్రేమాయణంలో పిడకల వేటలా జగన్నాథం వచ్చే వరకూ ఆసంగతి తనకు తట్టనందుకు నెత్తి మీద గట్టిగా కొట్టుకున్నాడతడు.

జగన్నాథం అక్కడ్నించి నిష్క్రమించేక మరోసారి చూపును మేడమీదికి సారించేడు బుజ్జిబాబు.చంద్రవదన అతని వంకే చూస్తోంది

ఏం పేరో ఏమిటో! చంద్రవదనయితేనే బాగుణ్ణు!అనుకున్నాడు ఈలోగా ఆమె చూపును మరల్చుకుని ఏరియల్ వ్యూలో ఏషియన్ గేమ్స్ని టి.వి.లో చూసినంత ఆసక్తిగా పిల్లల ఆటని చూడ్డం మొదలు పెట్టింది-

బుజ్జిబాబుకేం పాలుపోలేదు-మరీ శిలావిగ్రహంలా అక్కడే నిలబడి చూస్తె రేపు గది ఖాళీ చేసే పరిస్థితి కూడా రావొచ్చని భయ పడి నాలుగు సార్లు లోపలికీ బయటికీ తిరిగేడు-

పిల్లల ఆట అయిపోయాక ఆ ముద్దుగా బొద్దుగా వున్న అబ్బాయిని సైగ చేసి పిలిచాడు- తనలా పిలవడం చంద్రవదన చూస్తోందో లేదోనని మరొక్కమారు ఆమె వంక చూసి; చూస్తూందని నిర్ధారించుకున్నాక హీరోలా కాలరెగరెయ్యబోయి. వూరుకున్నాడు-

'ఏం టకుల్. ఎందుకు పిలిచారూ" అంటూ వచ్చాడా అబ్బాయి. నవ్వి;అతని భుజం మీద చెయ్యేసి తనగదిలోకి తీసుకెళ్ళేడు బుజ్జిబాబు.

"ఏంలేదు. వూరికినే- ఏం చదువుతున్నావ్" అడిగేడు.

చేప్పేడా అబ్బాయి-

"ఏం పేరు?"

"రాంప్రసాద్"

తనుకొన్న చాక్లెట్లను అతనికిస్తూ.

"బావుందోయ్—మరి మీ అక్కయ్య పేరేంటి" అడిగేడు. అర్థం కానట్టు చూసేడు రాంప్రసాద్. ఆతర్వాత ఆశ్చర్యంగా అడిగేడు.

"అక్కయ్యెవరూ?" అని.

ఈమారు బుజ్జిబాబు కేం చెప్పాలో అర్థం కాలేదు—

"నీకు అన్నయ్యలుగాని అక్కయ్యలుగాని లేరా?" అడిగేడు మళ్ళీ

"ఉన్నారు. ఇద్దరు- సుబ్బారావు; గోపాలరావూ!" ఖంగు తిన్నాడు బుజ్జిబాబు.

"మరి అక్కయ్యలూ....?"

"లేరు—ఒకే ఒక చెల్లి.... పేరు చంద్రముఖి"

పాతాళంలోకి కుంగిపోయాడు బుజ్జిబాబు. రాంప్రసాద్ కిచ్చిన లంచం గోడకేసిన సున్నమేనా అని మనసులోనే వాపోయాడు.

"ఆ ఆకుపచ్చ మేడలోనేగా మీరుండేదీ" అడిగేడు అనుమానంగా. అవునన్నట్లు తలూపేడు రాంప్రసాద్.

"మరి మేడమీద నిలబడి యింతసేపూ మీ ఆట చూసినమ్మాయి మీ అక్కయ్య కాదూ?"

"కాదు వందన. మా యింటిగలవారమ్మాయి, వాళ్ళు మేడమీదుంటారు. మేం వుండేది క్రిందన" అన్నాడా అబ్బాయి.

"హమ్మయ్య, పేరు తెల్సింది. గోడకేసిన సున్నం వూరికే పోలేదు" అనుకున్నాడు బుజ్జిబాబు.

"నే వెళ్తా నంకుల్. రేపొస్తా" అంటూ లేచేడు రాంప్రసాద్.

"ఒద్దులే! "అనబోయి," మరిరేపు వందన తమ్ముణ్నె కూడా తీసుకొస్తావా" అడిగేడు.

మరో మారు ఆశ్చర్యంగా చూసి, "మీరు కొత్తగా వచ్చేరా" ఎదురు ప్రశ్న వేసేడు. అవునన్నట్లు తలూపేడు బుజ్జిబాబు.

"అనుకుంటూనేవున్నా—వందనకు తమ్ముళ్ళు లేరు." అంటూ తుర్రుమన్నాడు.

కుర్చీలో వెనక్కి జారగిల బడిపోయేడు బుజ్జిబాబు.

0 0 0 0

వందన నవ్వింది.

విరజాజులు విచ్చుకున్నట్లూ; సాయంకాలమే చంద్రోదయమైనట్లూ; అనిపించింది బుజ్జిబాబుకి.

తనని చూసే నవ్విందా?

కొంపదీసి రాంప్రసాద్‌గాని చెప్పేయ్యలేదుగదా!

'దొరికిపోయాడు దొంగ!' అనే అర్థం లేదుగదా ఆ నవ్వులో?

'కనుక్కోలేక పోయావ్' అని హేళన లేదుగదా!

'ఛ-అదేంకాదు." అనుకున్నాడు ఆ వెంటనే.

ఆ దరహాసం వెన్నెల విరజిమ్మినట్లుంది. మల్లెలు రువ్వినట్లుంది—

ఫర్వాలేదు-తన దారిలోనే పడుతోంది అనుకున్నాడు.

ఏమైతే అయిందని ఓ చిన్న నవ్వుల బాణం వేశాడు బదులుగా.

ఓ చిన్ననవ్వు నవ్వి; సిగ్గుతో తలొంచుకుంది.

'అంటే వందనకూడా తనని ప్రేమించటం మొదలు పెట్టిందా?'

'కూడా అంటే తనుకూడా ప్రేమిస్తున్నాడనేగా!'

మనసు దానంతటదే మాటల్ని పేర్చుకుంటూ పోతోంది.

ప్రేమంటే ఏమిటి?

వయసులోని రెండు మనసులు పరస్పరం ఆకర్షించుకుని కలిసి పోవాలనుకోడం.

ముళ్ళపూడి వారి భాషలో రెండు హృదయాలు ఒకే పన్థాన నడవడం.

(బుజ్జిబాబు చిన్నప్పుడు ఎన్నో ప్రేమకథలు చదివేడు-వాటితో పాటు వాళ్ళవూరి లైబ్రరీలో కూర్చొని కన్నీళ్ళకథలూ, జాలికథలూ. జాలీకథలూ, పాదధూళి కథలూ చదివేడు. వాటితో పాటు తిలక్. దేవులపల్లీ వంటి గొప్పకవుల కవిత్వమూ చదివేడు-అర్థం చేసుకుందికి ప్రయత్నించి తనూ అంతటి గొప్పవాడు కావాలనికలలుకన్నాడు.నిద్ర-కలలూ రాని రాత్రులు లేచి ఏవేవో బరుకుతూ తెల్లకాగితాల్ని అక్షరాలతో నింపేవాడు)

అంచేత ముళ్ళపూడి వారి థీరీతో చూసినా,

వందనకి తనంటే యిష్టమున్నట్లుంది-ప్రేమకూడా వుండే వుంటుంది-లేకుంటే ఎందుకు నవ్వుతుంది?

తనకీ వందనంటే యిష్టమూ ప్రేమా అన్నీ వున్నాయి.

ఆమె చూస్తానంటే రోజులకొద్దీ దరహాసాన్ని ముఖం మీద చెరిపేసుకోకుండా ఆమెను చూస్తూ వుండిపోగలడు-ఏ విధంగా చూసినా తాము పరస్పరం ప్రేమలో పడ్డట్టు అర్థమైంది బుజ్జిబాబుకి.

ఆ రోజురాత్రి.... వెన్నెల లోకమంతా విరబూసి విడిది చేసిన వేళ....నిండు జాబిల్లి నింగిలోంచి బుజ్జిబాబుని పలకరించిన వేళ.... అతని పెన్ను వురుకులతో పరుగెత్తింది. మనసులోని భావం అక్షర రూపం దాల్చింది.

"మేడమీది జాబిలీ
విరిసిన ఓ నవమల్లీ....
చిరునవ్వులు విరితావులు దొరలించే నెచ్చెలీ....
గుండెలోన నీచూపు గుబులు గుబులుమంటుంటే
కన్నులలో నీ రూపు వెంటతరుముతూ వుంటే

కలలుగని నినువలచి విరహదాహమై పోతినే....
పలుకుల మధుమాసం నీవని
తళుకుల ఆకాశం నీదని
నడిచే వీణవనీ వలపుల జాణవనీ
కలలు గంటినే
రావేలనే.... నను చేరగా.... మేడమీది జాబిలీ."

* * *

రాంప్రసాద్ ద్వారా నాలుగురోజుల్లో చాల సంగతులే సేకరించేడు బుజ్జిబాబు. వందన ఇంటర్ పాసై సంగీతం నేర్చుకుంటోందనీ; ఆమెకున్న ఒక్కగానొక్క అన్నగారూ బెంగుళూర్లో పనిచేస్తున్నాడనీనూ.

ఎప్పటి కప్పుడు ఆమెతో మాటలు కలపాలని పించేది బుజ్జిబాబుకి-కానీ ఎలా?

వందనకు పుస్తకాలన్నా తెలుగు సాహిత్యమన్నా యిష్టమని తనతో తెచ్చుకున్న "దైవమిచ్చిన భార్య" పంపేడు "రాధాగోపాలం కథలు" పంపేడు-లైబ్రరీనుంచి తెచ్చి "అమరావతి కథలు" పంపేడు. "ఆద్యంతాలు మధ్య రాధ" పంపేడు-ఇవన్నీ రాంప్రసాద్ ద్వారా అందుకుని, చదివి ఎప్పటికప్పుడు పంపేసేది వందన, 'బావుంది' అన్న కామెంట్‌తో సహా.

తన యిష్టాలూ, ఆమె యిష్టాలూ ఒకటైనందుకు మరింత సంబరపడి పోయాడు బుజ్జిబాబు. అటువంటి వందనను తన జీవితంలోకి ఆహ్వానిస్తే తన బ్రతుకు వెన్నెల పంటవుతుందనీ; తనబాట పూలబాటవుతుందనీ; తమ సంసారంలో వెన్నెల విరగబూస్తుందనీ అమావాస్యలు అసలుండవనీ...ఎన్నో కలలు....పగలుకూడా కన్నాడు బుజ్జిబాబు.

అలా కలలుగనే వేళలో బుజ్జిబాబులో విపరీతమైన ఆవేశం పొంగుకొొచ్చేది-మనోబలం పెరిగినట్లయ్యేది-ధైర్యంతో రామ్మ ఎదర కొచ్చి ఎగిరెగిరి పడేది!

పిరికితనం ఎంతటి ప్రేమనైనా అణచివేస్తుంది-ధైర్య సాహసా లుంటే జాబిల్లినికూడా నేలమీదికి తెచ్చే ప్రయత్నం చేయవచ్చు.

అంచేత....ధైర్యంచేసి ఆమెకు తన ప్రేమను వ్యక్తం చేయాలి, తను రాసుకున్న ప్రేమ కవిత్వం చూపాలి-కల్పుకుని తన కున్న ప్రేమకలల్ని విప్పాలి-పెళ్ళే ప్రేమ పరిపక్వతకు పరాకాష్ట అని చెప్పాలి....అనుకున్నాడు,

ఆరాత్రి....మంచుసోనలు భూమిమీదికి తెరలు తెరలుగా జారు తున్న వేళ....బుజ్జిబాబు గదిలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న వేళ....ఓ మధురమైన సంగీతం పిల్లగాలుల మధ్యనించీ, మంచుతెరల మాటునించీ వచ్చి విన్పించింది.

"ఓర చూపు జూచేది న్యాయమా
ఓ రఘూత్తమా....నీ వంటివానికి...."

చేష్టలుడిగి నిలబడిపోయాడు బుజ్జిబాబు-సందేహం లేదు.అపాట వందనదే-అంత మధురమైన కంఠం యింకెవరికుంటుంది? అది రాముని మీద త్యాగరాజు రాసిన కీర్తనే అయినా తనను గురించే వందన పాడు తున్నట్లనిపించింది బుజ్జిబాబుకి,

అతని మనసు ఆనంద పారవశ్యంతో వూగిపోయింది, ఆ క్షణంలో అతని కలం కొత్త పుంతలు తొక్కింది.

"పాడరాదా ప్రియతమా
ప్రేమే ప్రాణమనీ....ప్రేమే అమృతమనీ
పదే పదే మనసారా॥
మనసు ఊసులు కనులబాసలు

మోసులెత్తే కొత్త ఊహలు....
మురిసి మసిరే మనోజ్ఞమై
వలపు కలలో....తలపు ఝరిలో॥
మనసు పూవుల పడవగా
మమత మీగడ తరకగా
మలచి వలచి రాగ మధువై
నిదుర కాచి విరహాశ్రుతివై
తేలిపోయే వెండి రాత్రిలో....పాడరాదా."

రాసిన పాటను మరొక్క మారు చదువుకున్నాడు బుజ్జిబాబు. ఆ వెంటనే ఓ నిర్ణయానికొచ్చాడు—అదే అసలు సిసలైన మార్గం—ఆఖరి మార్గం అనుకున్నాడు. ఆ తర్వాత హాయిగా నిద్రపోయాడు.

ఆ మర్నాడే తను రాసిన పాటను ఓ తెల్లకాగితం మీద అందంగా రాసి తెల్లకవర్లో పెట్టి అతికించాడు.

రాంప్రసాద్‌ని పిలిచి, "వందన యీపాట పాడగలరేమో అడుగు" అని. అనుమానం రాకుండా చెప్పి అతని కందించాడు.

అంతే! అది తీసుకెళ్ళిన రెండు రోజుల వరకూ రాంప్రసాద్ రాలేదు—"ఏం జరిగివుంటుంది? తను చేసింది తప్పా" అనుకొని ఆలోచనలతో వుక్కిరి బిక్కిరయ్యేడు. ఆ తర్వాత. "మరీ అంత ధైర్యం పనికి రాదు" అని తనను తానే హెచ్చరించుకున్నాడు.

మూడో రోజు సాయంకాలం మెరుపులా వచ్చి పిడుగులాంటి వార్తను తెచ్చాడు రాంప్రసాద్. "వందన మిమ్మల్ని రమ్మంటోంది" అని—

కలా? నిజమా? అనే సంభ్రమాశ్చర్యంలో కాస్సేపేం మాట్లాడ లేదు బుజ్జిబాబు. తర్వాత కుడిచేత్తో ఎడం చేతిమీద గిల్లుకొని, ఎదు

రుగా వున్న రాంప్రసాద్‌ని పట్టుకొని అతనిచేత అదేమాటని మరోసారి చెప్పించుకుని, అతనిచేతిలో చాక్లెట్లు పోసి, ఓ ఈలవేశాడు.

రాంప్రసాద్‌ని పంపేసి, పది నిముషాల్లో స్నానం చేసి, మల్లె పువ్వులాంటి తెల్లబట్టలేసుకున్నాడు-క్రాఫింగు అందంగా వచ్చేట్లు దువ్వుకుని, అద్దంలో ముఖాన్ని అందమైన భంగిమలో ఒకటికి నాలుగు సార్లు చూసుకుని, మాట్లాడాలనుకున్న మాటల్ని అందమైన వాక్యాల్లో మదిలో వూహించుకుని బయల్దేరాడు.

మేడ మెట్లన్నీ ఎక్కి ఒక్క క్షణం ఆగేడు బుజ్జిబాబు. డాబా మీద ఒకే ఒక కుర్చీ ఖాళీగా వుంది.

గుమ్మం వైపు చూశాడు. తెరకదిలింది.

“రండి” అని సన్నని పిలుపు నెమ్మదిగా వినిపించింది.

అది పిలుపులా కాక వీణమీటినట్లు అనిపించింది బుజ్జిబాబుకి.

తెర తొలగించుకుని లోపలకు అడుగుపెట్టేడు.

ఎదురుగా....వందన! ఆకాశం రంగు చీర; అదేరంగుజాకెట్టు. మెడలో ముత్యాలహారం. చెవులకు డ్రాప్స్. రెండు చేతులకీ రెండేసి బంగారు గాజులూ.

కుర్చీలో కూర్చున్నదల్లా గౌరవంగా లేవబోయింది.

“ఫర్వాలేదు కూర్చోండి” అంటూ ఆమె కెదురుగా కూర్చొన్నాడు బుజ్జిబాబు. తలెత్తి ఆమె కళ్ళలోకి చూడ్డానికి ధైర్యం చాలలేదు. మౌనం ఒక్క క్షణం యిద్దరి మధ్యా తాండవ మాడింది.

“మీ పాట బాగుంది. ట్యూన్ చేసుకొని పాడుకోనా” అంది వందనే.

నవ్వి; సిగ్గుపడ్డట్లు తలొంచుకున్నాడు బుజ్జిబాబు. లోపలి సంతోషం అతని మనసు పొరల్ని బద్దలు చేస్తోంది.

“అంత చక్కని పాటలెలా రాస్తారు మీరు?” అడిగింది.

"మనసులో అందమైన భావాలు మొలకెత్తినపుడు" అన్నాడు కాస్సేపాగి.

ఆశ్చర్యంగా అతని కళ్ళలోకి చూసింది వందన.

"అంటే.... భావాలకి కూడా అందాలుంటాయా?"

ఓ చిన్ననవ్వు నవ్వి వూరుకున్నాడు బుజ్జిబాబు. తమ మధ్య సంభాషణ అనుకోని రీతిగా సాగడం అతనికాశ్చర్యాన్ని కలిగిస్తోంది.

"అదృష్టవంతులు-మంచి పుస్తకాలు చదువుతారు. అందమైన భావాలతో చక్కని పాటలు రాస్తారు. సంగీతం కూడా వచ్చా?"

"విని ఆనందించడం వొచ్చు" అన్నాడు.

వందన నవ్వేసింది.

"అందమైన భావాలు ఎలా కలుగుతాయట?" అడిగింది మళ్లీ ఒక్క క్షణం ఆగి, "అపురూప సౌందర్యాన్ని చూసినపుడూ, దాన్ని మనసారా యిష్టపడి ప్రేమించినపుడూ" అన్నాడు.

ఈమారు ఏం మాట్లాడలేదు వందన.

తనుగాని అడ్వాన్స్ అవుతున్నాడేమో ననిపించింది బుజ్జిబాబుకి. మరో రెండు నిమిషాలవరకూ ఆమెనుండి ఏమాటా రాక పోడంతో తలెత్తి ఆమె వంక చూశాడు.

ఆశ్చర్యం! ఆమె కళ్ళలో లీలగా.... నీళ్ళ! పెదవుల మీద సన్నని చిర్నవ్వు; చూపులో ఆరాధనాభావం.

"క్షమించండి-తప్పుగా ఏమన్నా అంటే...." అన్నాడు నొచ్చుకుంటూ.

వందన మరేం మాట్లాడలేదు-లేచి గదిలోపలికి నడిచింది.

అంతే!

ఆమె నడకను చూస్తూ స్థాణువులా అలాగే వుండిపోయాడు బుజ్జిబాబు. అతని మనసులో తుఫాను చెలరేగింది.

తను చూస్తున్నది నిజమేనా?

కాస్సేపట్లోనే తిరిగొచ్చి. బిస్కెట్లతో వున్న గాజుప్లేటును బుజ్జిబాబు ముందుంచి "తీసోకండి" అంది వందన.

ఆమె ముఖంలోకి చూడలేకపోయాడు బుజ్జిబాబు. అతని ఆలోచనలు ఎక్కడెక్కడికో పోతున్నాయి. కాస్సేపు మౌనం తర్వాత-

"ఏమిటిది వందనా?" .... మీరు ...." అన్నాడు బొంగురు గొంతుతో.

"దురదృష్టవంతురాల్ని-ప్రేమించడమేగాని ప్రేమింపబడ్డం తెలియనిదాన్ని-చిన్నతనంలోనే వచ్చిందీ పోలియో-లోకమంతా తిరగాలనీ ఎన్నెన్నో అందాల్ని చూడాలనీ పురకలెత్తే నా మనసు నిరంతరం యీ డాబాకే అంకితమై పోయింది"

తలెత్తి ఆమె వంక చూశాడు బుజ్జిబాబు. ఆమె కళ్ళు నిశ్చలంగా జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి.

ఆమెనెలా ఓదార్చాలో అర్థం కాలేదు బుజ్జిబాబుకి.

అది అతనూహించని పరిస్థితి.

"నిరుత్సాహ పడకండి వందనగారూ. మికేం? హాయిగా చదువుకున్నారు-మానసికానందం కోసం సంగీతం నేర్చుకున్నారు-పుస్తకాల ద్వారా లోకాన్ని చదువుకున్నారు-అన్నిటినీ మించి మంచి మనసుంది. చాలమందికంటే మీరు చాల రకాలుగా నయం" అన్నాడు.

ఆ మాటలకు అతని వంక ఆశ్చర్యంగా చూసింది వందన.

ఆ చూపులో ఏవేవో భావాలు-ఎన్నెన్నో మాటలు-ఆరాధనా ప్రవాహాలు! ఏం మాట్లాడానికీ మాటలు రాలేదామె నోటివెంట.

బుజ్జిబాబు లేచేడు.

అతని హృదయంలో ఏదో అలజడి—మాటల్లో వణుకు-!

"ఎప్పుడేనా పాటరాస్తే పంపిస్తారా"

అడిగింది గుమ్మం దాటుతూంటే.

ఆమె కళ్ళలోకి చూశాడు బుజ్జిబాబు.

ఆ కళ్ళు వర్షిస్తున్నాయి!

* * * *

నాలుగురోజులు ఆ మేడ ముందున్న డాబా మీద కుర్చీ ఖాళీగానే వుండిపోయింది.

ఆ నాలుగురోజూలూ బుజ్జిబాబు గది కిటికీ తలుపులు మూసుకునే వున్నాయి.

ఐదో రోజు నిండు పూర్ణిమ.

నింగి లోంచి జాబిల్లి తొంగి చూసింది.

మనసు కవాటాలు దాటి మనోనిశ్చయం బయటకొచ్చింది.

రాంప్రసాద్ ద్వారా కవరు నందుకున్న వందన ఆత్రుతగా తెరచి చదివింది.

అది బుజ్జిబాబుపాట—మనసు పాడిన పాట!

"వందనా!

పాటకి రాగం జోడిస్తేనే అందం—నా పాటకు రాగం కావాలి.

నాదృష్టిలో వెన్నెల్ని వెదజల్లే జాబిల్లికి మచ్చలేదు.

నాకు జాబిల్లి కావాలి—వెన్నెల చల్లదనమూ కావాలి.

ఆత్యాసంటారా? నా యీ భావానికి రాగం కూర్చగలరా?

—బుజ్జిబాబు

వందన కళ్ళు ఆనందంతో తడిశాయి.

మేడమీంచి తొంగి చూసింది.

క్రింద—తెరచి వున్న కిటికీ రెక్కల కానుకుని నిల్చుని చకోరంలా చూస్తున్న బుజ్జిబాబు వెన్నెల పువ్వులా వున్నాడు.